సాక్షి విజయనగరం

మంగళవారం । 17 । జనవరి । 2023



పండగ విషాదం

సంక్రాంతి పండగ వేళ ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన ప్రమాదాలు అయా కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. శోక సంద్రంలో ముంచాయి. - 8లో



వరిచేను కుప్పలు దగ్ధం

గరివిడి మండలంలోని వీపీరేగలో సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో 3 ఎకరాల విస్తీర్ణానికి చెందిన వరిచేను కుప్పలు దగ్ధమయ్యాయి. రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. - 8లో



చిల్డ్రన్స్ బోటు విహార్ ప్రారంభం

సీతంపేట: సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక అడ్వంచర్ పార్కులో కొత్తగా చిల్డ్రన్స్ బోటు విహార్‌ను ఆదివారం ప్రారంభించారు. పార్కుకు వచ్చే చిన్నారులను సైతం అలరించేందుకే ఈ బోటు విహార్‌ను ప్రారంభించినట్లు ఐటీడీఏ ఏపీఓ వై.రోసిరెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

ఆసరా కల్పిస్తున్న హాస్టల్స్

- జిల్లాలో 5 సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు
- ఒక్కోదానిలో 50 మంది చొప్పున 250 మందికి వసతి
- సౌకర్యాల కల్పనలో సమగ్రశిక్ష, విద్యాశాఖ



జామి మండలం విజినిగిరి హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న సీజనల్ హాస్టల్స్ విద్యార్థులకు ఆసరా కల్పిస్తున్నాయి. చక్కగా చదువుకునేందుకు అవసరమైన వసతిని ఇస్తున్నాయి. తల్లిదండ్రులు వలసవెళ్లినప్పుడు వారి పిల్లల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీజనల్ హాస్టల్స్‌ను గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభించింది. హాస్టల్స్‌లో విద్యార్థులకు మూడు పూటలా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తోంది. విద్యార్థులకు అనుభవజ్ఞులైన శిక్షకులచే స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. మెంటాడ మండలంలో పెదమేడపల్లి, జక్కువ, జామి మండలంలోని విజినిగిరి, దత్తిరాజేరు మండలంలోని టి.బూర్జువలస, పూసపాటిరేగ మండలంలో బర్రిపేట గ్రామాల్లో నడుస్తున్న సీజనల్ హాస్టల్స్‌లో ప్రస్తుతం 250 మంది విద్యార్థులు చదువుతున్నారు.హాస్టల్స్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ.. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నామని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వీఏ స్వామినాయుడు తెలిపారు.

మళ్లీ వచ్చిన ఏనుగులు



చింతలబెలగాం అరటి తోటలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: ఏనుగుల గుంపు వెంకటరాజపురం, బాసంగి, బాసంగి గదబవలస, చింతలబెలగాం, సింగనాపురం, కుదమ తదితర గ్రామాల పంట పొలాల్లోకి ఆదివారం రాత్రి మళ్లీ వచ్చాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది కోరారు. నాగావళి నది, గుమ్మడిగెడ్డవాగులో తాగునీరు పుష్కలంగా ఉండడం, అరటి, చెరకు, కూరగాయల పంటలు ఆహారంగా లభిస్తుండడంతో ఎటువెళ్లినా ఇక్కడకే వస్తున్నాయన్నారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని, ఏనుగుల జాడ చూసుకుని పొలంపనులకు వెళ్లాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజలు



కోటదుర్గమ్మ ఆలయ ఆవరణలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

పాలకొండ: స్థానిక కోటదుర్గమ్మ ఆలయ ఆవరణలో గోమాతకు సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కనుమ పండగ రోజు గోమాతను పూజిస్తే సకల దేవతల దర్శనం చేసుకున్నట్లు అని, అలాగే సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఆవులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పండగవేళ.. పర్యాటక శోభ



తోటపల్లి ప్రాజెక్టువద్ద సందర్శకుల సందడి

గరుగుబిల్లి : సంక్రాంతి, కనుమ పండగ వేళ దూర ప్రాంతాల నుంచి పల్లెలకు చేరుకున్నవారంతా పర్యాటక ప్రాంతాల సందర్శనకు పరగుతీశారు. జలాశయాలు, జలపాతాలను సందర్శించారు. పార్కుల్లో సేదతీరారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు. తోటపల్లి రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు.

సంబరంగా సంక్రాంతి

- పండగకు రూ.కోట్లు ఖర్చు చేసిన ఉమ్మడి జిల్లా ప్రజలు
- కొత్త వస్త్రాలకు రూ.250 కోట్లకు పైగా ఖర్చు
- మాంసం, పిండి వంటలు, వినోద ఖర్చులకు రూ.50కోట్లు
- సంప్రదాయ ఆటలు, పందాల నిర్వహణకు రూ.25 కోట్లు
- ప్రయాణ ఖర్చులు రూ.4 కోట్లకు పైమాటే

విజయనగరం:

సంక్రాంతి వచ్చింది.. ఇంటింటా సరదాలు తెచ్చింది... కరోనా ప్రభావంతో గత రెండేళ్ల ఆంక్షలు నడుమ చేసుకున్న తెలుగింట పండగను ఈ ఏడాది మూడురోజులపాటు వైభవంగా జరుపుకున్నారు. ఇళ్ల అలంకరణ, నూతన వస్త్రాలు, ప్రత్యేక వంటకాలతో పల్లెల్లో కొత్త సందడి కనిపించింది. సామాన్యుడు, సంపన్నుడనే తారతమ్యం లేకుండా ఎవరి స్థాయిలో వారు పండగను ఆస్వాదించారు. ఏడాదిలో మొదటిగా జరుపుకునే పండగకు ప్రత్యేక స్థానం కల్పిస్తూనే ఖర్చులోనూ అదే ప్రాధాన్యమిచ్చారు. ఈ మూడు రోజుల కోసం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు కోట్లలో ఖర్చు చేశారంటే పండగ సందడి అర్థం చేసుకోవచ్చు.



వేపాడ: కొండగుళ్లు తీర్థంలో జనసమాహారం

నూతన వస్త్రాల కోసం రూ.250 కోట్ల పైమాటే...



పార్వతీపురంలోని వస్త్రదుకాణంలో అమ్మకాలు (ఫైల్)

సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు వస్త్ర దుకాణాలకు పెద్ద పండగ వచ్చినట్టే. ఏడాదిలో చేసే వ్యాపారం ఈ ఒక్క నెలలోనే సాగుతుంది. కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నూతన వస్త్రాలు కొనుగోలు చేయడం ఆనవాయితీ. దీంతో వీటి వ్యాపారానికి గిరాకీ పెరుగుతుంది. విజయనగరం పట్టణంలో 'బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్'లో జోరుగానే విక్రయాలు సాగాయి. సుమారు 250 వరకు బ్రాండెడ్, సాధారణ దుకాణాలుండగా.. ప్రధానంగా పిల్లల రెడీమేడ్ దుస్తులు, మహిళల చీరలు అమ్మకాలు అధికంగా సాగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి, సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, మధ్యప్రదేశ్ ప్రాంతాలను నుంచి రిటైల్ వ్యాపారులు ఈ మార్కెట్‌కి వచ్చి నిత్యం విక్రయాలు చేస్తుంటారు. రిటైల్ వ్యాపారంతో బిజీగా ఉన్న దుకాణ యాజమాన్యులు సాధారణ వినియోగదారుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఒక అడుగు ముందుకువేసి షాపు ముందే ఆరుబయట తాత్కాలిక అమ్మకాలు చేశారు. పట్టణంలోని కన్యకాపమేశ్వరి ఆలయం కూడలిలోని ఉల్లి వీధి, గంటస్తంభం జంక్షన్, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లోని ప్రధాన షాపుల్లో కూడా వస్త్రవిక్రయాలు జోరుగా సాగాయి. మొత్తంగా జిల్లాలో ఈ ఏడాది రూ.250 కోట్ల వరకు వస్త్ర వ్యాపారం సాగినట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

విందు.. వినోదాల కోసం..

కొత్త అల్లుళ్లకు మర్యాదలు, ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు సందడిగా మారాయి. పండగ మూడు రోజుల పాటు మాంసాహారానికి, పిండివంటకాలు, వినోద ఖర్చుల కోసం రూ.50 కోట్లు ఖర్చు చేయగా అందులో కేవలం మాంసాహారానికి రూ.20 కోట్ల వరకు ఖర్చు చేశారు. కిలో మటన్ ధర రూ.800 పలికింది. గతేడాది రూ.700 ఉన్న ధర ఈ ఏడాది రూ.100 పెరిగింది. అలాగే, చికెన్ పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది స్కిన్‌తో కలిపి రూ.180, గ్రామీణ ప్రాంతాల్లో రూ.190 నుంచి రూ.200 వరకు పలికింది. ఇతర సరదాల కోసం రూ.5 కోట్ల వరకు ఖర్చు చేశారని అంచనా.



నోరూరించే అరిసెలు

పెరుగుతున్న ఖర్చు...

తెలుగువారింట ఎంతో ఆడంబరంగా జరుపుకొనే సంక్రాంతి పండగ ఖర్చు ఏటేటా పెరుగుతోంది. శుభకృతనామ సంవత్సరంలో జనవరి 14, 15, 16 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా జరుపుకున్న పండగ కోసం రూ.కోట్లలో ఖర్చయినట్లు వ్యాపార వర్గాలు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలో 166 మద్యం దుకాణాలు ఉండగా... బార్‌లు 31 వరకు ఉన్నాయి. వీటి ద్వారా గడిచిన పక్షం రోజుల్లో సుమారు రూ.25 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరిగాయి. విలాసాలు, ఆడంబరాలకు జనం వెనుకాడకుండా మరో రూ.20కోట్లు వరకు ఖర్చుచేసినట్టు అంచనా.



వేపాడ: కొండపైకి వెళ్తున్న తోమడ పెద్దు

భక్తజన జాతర..

వేపాడ: విజయనగరం జిల్లాలో సంక్రాంతి, కనుమ పండగలు వైభవంగా జరిగాయి. కనుమ పండగను పురస్కరించుకుని సోమవారం పలు గ్రామాల్లో నిర్వహించే తీర్థాలకు జనం పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేపాడ మండలం కొండగుళ్లు బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జాతర జన సంద్రాన్ని తలపించింది. జాతరలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి.

ప్రయాణ ఖర్చు రూ.4 కోట్ల పైమాటే..



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పండకు వచ్చే ప్రయాణికుల సందడి (ఫైల్)

వివిధ ప్రాంతాల నుంచి పండగకు పల్లెలకు చేరుకున్న వారు గతవారం రోజుల్లో సుమారు రూ.4 కోట్లు వరకు ఖర్చు చేశారు. విజయనగరం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, ఎస్.కోట డిపోల్లో సుమారు 560 ఆర్టీసీ సర్వీసులు నడుస్తుండగా... సాధారణ రోజుల్లో రూ.40 లక్షలు వరకు ఆదాయం వస్తుంది. కేవలం విజయనగరం జిల్లా కేంద్రం నుంచి విజయవాడ, హైదరాబాద్‌కు 14 సర్వీసులు నిర్వహించగా... సాధారణంగా నడిపే 111 సర్వీసుల నుంచి పండగ నేపథ్యంలో రూ.2 కోట్ల వరకు ఆదాయం వచ్చిందని అంచనా. వ్యక్తిగత వాహనాలపై రాకపోకలకు మరో రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారని అంచనా.

మార్కెట్ కమిటీలకు లక్ష్యానికి మించి ఆదాయం

- ఆదాయ లక్ష్యం రూ.10 కోట్లు
- ఇంతవరకు వచ్చిన ఆదాయం రూ.4 కోట్లు
- సివిల్ సప్లయి నుంచి కమిషన్ రూపేన రావాల్సింది రూ.15 కోట్లు
- జిల్లాలో మార్కెట్ కమిటీల సంఖ్య: 8
- మార్కెటింగ్‌శాఖ ఏడీ శ్యామ్‌కుమార్ వివరణతో కూడిన కథనం



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు లాభాలబాట పట్టాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయం ఆర్జిస్తున్నాయి. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయం అంతంత మాత్రంగానే ఉండేది. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ కమిటీల బలోపేతానికి తీసుకున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి.

జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు

జిల్లాలో విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, పూసపాటిరేగ, కొత్తవలస, చీపురపల్లి, మెరకముడిదాంలలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యం రూ.10 కోట్లు. మార్కెట్ కమిటీలు ఇంతవరకు సాధించిన ఆదాయం రూ.4కోట్లు. మార్కెట్ కమిటీలకు సివిల్ సప్లయి శాఖ నుంచి రూ.15 కోట్లు కమీషన్ రావాల్సి ఉంది. ఈ నిధులు వచ్చినట్టయితే ఆదాయం రెట్టింపు అవుతుంది. మరో రెండున్నర నెలలు గడువు ఉండడంతో మరో రూ.2 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని మార్కెట్ కమిటీ వర్గాలు చెబుతున్నాయి.

ఆదాయార్జన ఇలా..

వ్యవసాయ చెక్ పోస్టుల్లో వసూళ్లు, గోదాముల అద్దెలు, వ్యాపారలావీల ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం వస్తుంది. వివిధ రకాల వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర సామగ్రిని తరలించే వాహనాల నుంచి కొంత రుసుము వసూలు చేస్తారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఉన్న షాపుల నుంచి సెస్ (పన్నులు) వసూలతో ఆదాయం వస్తుంది.

ఆదాయ మార్గాలు పెరిగాయి

మార్కెట్ కమిటీలకు ఇంతవరకు రూ.4 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. సివిల్ సప్లయిశాఖ నుంచి కమీషన్ రూపేన ఆదాయం రావాల్సి ఉంది. మార్కెట్ కమిటీలకు ఆదాయ వనరులు పెరిగాయి. మార్కెట్ కమిటీల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఆదాయ వనరులను పెంచుతున్నారు.

– ఎ.శ్యామ్‌కుమార్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

పల్లెలు కళకళ.. పట్టణం వెలవెల..

సంక్రాంతి పండగకు పట్టణాల్లో నివసించేవారంతా పల్లెబాట పట్టారు. దీంతో పల్లెలు జనంతో కళకళలాడగా, పట్టణాలు వెలవెలబోయాయి. దీనికి విజయనగరం పట్టణంలో సోమవారం కనిపించిన చిత్రాలే సజీవసాక్ష్యం. నిత్యం జనం, వాహనరాకపోకలతో రద్దీగా ఉండే కాంప్లెక్స్, వివిధ కూడళ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. కొనుగోలుదారులు లేక మార్కెట్లు బోసిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



జనం లేక ఖాళీగా కనిపిస్తున్న విజయనగరం ఆర్టీసీ కాంపెక్స్



వెలవెలబోయిన విజయనగరం పాత బస్టాండ్ రోడ్డులోని మార్కెట్

బోనాల పండగ

బలిజిపేట: తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు సజీవంగా సాగుతున్నాయి. తెలంగాణాలో నిర్వహిస్తున్న బోనాల పండగ మాదిరిగా బలిజిపేట మండలం మిర్తివలస గ్రామంలో మూడుతరాల నుంచి నిర్వహిస్తున్నారు. ఏటా సంక్రాంతి పర్వదినాన గన్ను, గునపర్తి, మానం, శిగురుకోట, గంగు, గుండాపు కుటుంబాల వారు బోనాల పండగ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఐదు కుండలకు పసుపుకుంకమ బొట్లుపెట్టి.. వాటిని పూలతో అలంకరించి.. అందులో కలగూర, పరమాన్నం, మైదాపిండి అట్లు, అరిసెలు, అరటి పండ్లను వేసి ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారున ఉన్న ఎంకమ్మపేరంటాలకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆ వంటకాలను కుటుంబసభ్యులతో కలిసి ఆరగించారు.



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

పైడితల్లికి ప్రత్యేక పూజలు...

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారు సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకుని భక్తులకు పుష్పాలు, ద్రాక్ష పండ్ల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రీతికరమైన అరిసెలు, గారెలు, బూరెలను భక్తులు నైవేద్యంగా సమర్పించారు. పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు.

- గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గోపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శోభారాణి, సోమశేఖర్ శర్మ, అనంతలక్ష్మి, రుజుతారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. విజయనగరం టీటీడీ కల్యాణమండపం ఆవరణలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అర్చకుడు పీవీ నరసింహాచార్యులు, వేదపండితులు జి.గురునాథరావు శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపారు. కార్యక్రమంలో టీటీడీ ప్రోగ్రామింగ్ అధికారి జె.శ్యామ్ సుందర్, ప్రసాద్, జి.తిరుపతిరావు పాల్గొన్నారు.



పైడితల్లికి అరిసెలు, పండ్లతో నైవేద్యం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

గోమాతకు పూజలు..



కనుమ పండగను పురస్కరించుకుని మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు సీతం కళాశాలలోని గోశాలను సోమవారం సందర్శించి, గోమాతకు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

సంగిడీ పోటీలు...

రేగిడి: మండలంలోని చిన్నపుర్లి గ్రామంలో సోమవారం సంగిడీ పోటీలు నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన యువకులు పోటీల్లో పాల్గొన్నారు. రేగిడి మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన సత్యనారాయణ 200 కిలోల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకోగా, ఆముదాలవలస మండలం తమ్మినాయుడుపేటకు చెందిన వెంకటరమణ 180 కిలోలు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచాడు. సంతకవిటి మండలం తాలాడకు చెందిన మహేష్ వందకిలోల విభాగంలో పాల్గొని తృతీయ స్థానం సాధించాడు. వీరికి వరుసగా రూ.3వేలు, రూ.2,500, రూ.1000లు చొప్పున నగదు బహుమతి అందజేశారు. గ్రామానికి చెందిన కురిటి రామకోటి విజేతలకు బహుమతులు అందజేశారు.



సంగిడీల పోటీలో తలపడిన యువకుడు



180 కిలోల సంగిడీ ఎత్తుతున్న యువకుడు

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


చందక పద్మ(ఫైల్)

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామానికి చెందిన వివాహిత, మాజీ ఎంపీటీసీ చందక పద్మ(46) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల తరచూ కడుపునొప్పితో ఆమె బాధపడుతుండేది. సోమవారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు. ఆమె కుమారుడు త్రివేద్‌నాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు సంతాపం తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొమరాడ: పార్వతీపురం నుంచి శివిని మధ్యలో రైల్వే ట్రాక్ పై ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని పార్వతీపురం రైల్వే హెచ్‌సీ సి.రత్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి వయస్సు 33 సంవత్సరాలు ఉండవచ్చని, నీలం, నలుపురంగు టీషర్టు, రంగు జీన్ ప్యాంట్, ధరించి ఉన్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

మామిడి తోటలో మరోమృతదేహం

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి చెందిన ఓ మామిడి తోటలో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం రాత్రి స్థానిక పోలీసులు కనుగొన్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామ మాజీ సర్పంచ్ చేపేన జగన్నాథం మామిడి తోటలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించామని ఇన్‌చార్జ్ ఎస్సై బి.సురేంద్రనాయుడు తెలిపారు. మృతి చెందిన వ్యక్తిది ఏ ఊరో, ఏ ప్రాంతానికి చెందిన వాడో, ఎలా చనిపోయాడో తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పరిశీలించగా మూడు, నాలుగు రోజుల క్రితం మరణించినట్లు తెలుస్తోందన్నారు. మృతిచెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఎవరైనా హత్య చేశారా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పరిశీలించగా హత్యలా కనిపించలేదని చెప్పారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

20 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

భామిని: మండలంలో సంక్రాంతి సందర్భంగా పేకాట శిబిరాలపై దాడులు చేసి 20 మందిని అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై అమ్మాన్‌రావు సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో 12 మందిని అరెస్ట్ చేసి రూ.63,420, బత్తిలి పాత కాలనీ శిబిరంలో 8 మందిని అరెస్ట్ చేసి రూ.13,420 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

తోణాంలో ఐదుగురు పందాల రాయుళ్లు..

సాలూరు: మండలంలోని తోణాం శివారులో కోళ్ల పందాలపై దాడిచేసి ఐదుగురు పందాల రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ, సమాచారం మేరకు తోణాం శివారులో కోడి పందాల శిబిరంపై దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7040 నగదు, 7 కోళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

ముక్కువలో 8 మంది..

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ గ్రామ సమీపంలో కోడిపందెం ఆడుతున్న 8 మందిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై జి.షైడిరాజు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు ఆడుతుండగా పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.10,700లు నగదు, ఆరు కోడిపుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వరి కుప్పలు దగ్ధం

- సుమారు రూ.2లక్షల నష్టం

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని వీపీరేగలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామంలోని పలువురు రైతులకు చెందిన వరికుప్పలు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. వరికోతల అనంతరం గ్రామానికి గ్రామానికి చెందిన అల్లిపిల్లి శారద, గుంటుబారిక లక్ష్మణ, గుంటుబారిక పైడితల్లి, రాయల వెంకటరావులకు చెందిన సుమారు 3 ఎకరాలకు పైబడిన వరి పంటను గ్రామానికి కొంచెం దూరంలో కుప్పలుగా ఉంచారు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వరికుప్పల నుంచి మంటలు చెలరేగి వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో సమాచారం అందించగా చీపురుపల్లి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే చాలా వరకు వరి పంట అగ్నికి ఆహుతైపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల మేర నష్టం జరిగినట్లు బాధిత రైతులు, స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

పండగ విషాదం

సంక్రాంతి పెద్ద పండగ కొన్ని కుటుంబాల్లో విషాదం నింపింది. పండగ రోజున జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా మరికొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఆయా ప్రమాదాలకు సంబంధించి స్థానికులు, పోలీసులు, మృతుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

- వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి
- మరి కొందరికి గాయాలు


రఘు మృతదేహం


గాయాలపాలైనచ గౌరీశంకరరావు

పార్వతీపురం: మండలంలోని కొత్తవలస ఫ్లైఓవర్‌పై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. గరుగుబిల్లి గ్రామానికి చెందిన చిట్టి రఘు(24), వావిలపల్లి గౌరీశంకరరావులు గరుగుబిల్లి నుంచి పార్వతీపురం వెళ్తుండగా ప్రమాదం జరగడంతో రఘు అక్కడికక్కడే మృతి చెందాడు. గౌరీశంకరరావుకు తీవ్రగాయాలయ్యాయి. గౌరీశంకరరావును పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అలాగే రఘు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రఘు హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండగకు గ్రామానికి వచ్చిన సందర్భంగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంశధారలో మునిగి యువకుడు..

భామిని: పెద్ద పండగను చూడడానికి వచ్చిన ఉద్దానం యువకుడు వంశధార నదిలో మునిగిపోయి అసువులు బాశాడు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం కొత్తపుట్టుగకు చెందిన యర్రా పురుషోత్తం(26) హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. పురుషోత్తంతో పాటు అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న భామిని మండలంలోని బాలేరు-సొలికిరికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి పండగ కోసం బాలేరు వచ్చిన పురుషోత్తం మిత్రులతో కలిసి వంశధార నదిలో స్నానానికి దిగి మునిగిపోయి మృతిచెందాడు. మృతుడి మిత్రుల ఫిర్యాదు మేరకు బత్తిలి ఎస్సై అమ్మాన్‌రావు, వీఆర్‌ఓ గెల్లంకి వెంకటరమణలు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.


యర్రా పురుషోత్తం మృతదేహం

విద్యుదాఘాతంతో మరో యువకుడు..

పార్వతీపురం: గరుగుబిల్లి మండలం రావివలసకు చెందిన కె.విజయ్‌కుమార్ విద్యుదాఘాతంతో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. రావివలసకు చెందిన విజయ్‌కుమార్(29) లఖనాపురంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను అమరుస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై సమాచారం మేరకు స్థానిక ఎస్సై రాజేష్, ఎలక్ట్రికల్ ఏఈ బి.శంకరావులు గ్రామానికి వెళ్లి పరిశీలించి ఆరాతీశారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీటీసీ భరత్‌కుమార్ గ్రామంలో వివరాలు తెలుసుకున్నారు.


మృతిచెందిన విజయ్‌కుమార్

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

పార్వతీపురం: మక్కువ మండలం పాయకపాడునుంచి సీతానగరం మండలంలోని చినభోగిలి వస్తున్న ఆటో బగ్గందొరవలస వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈఘటనలో మక్కువ మండలం పాయకపాడు గ్రామానికి చెందిన బి.భోగమ్మ, బంగారమ్మ, బి.జీవ, జి.శ్రీలత, సీహెచ్.నవదీప్‌లకు గాయాలయ్యాయి. ఈమేరకు క్షతగాత్రులను 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

రెండు కార్లు ఢీకొని వ్యక్తికి..

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం సమీపంలో సోమవారం రెండు కార్లు ఢీకొని ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడని ఎస్సై పి.సూర్యకుమారి తెలిపారు. తెర్లాం నుంచి రాజాం వస్తున్న డి.మధుబాబు కారును ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మధుబాబు తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రాజాం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.





పార్వతీపురం: ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

అంతరించిపోతున్న కళకు ప్రాణం


కోమటిపల్లిలో ప్రదర్శన వేదికపై చిన్నారులను అభినందిస్తున్న వేదపండితుడు గౌరీప్రసాద్‌శర్మ

- జానపదకళలకు కోమటిపల్లిలో శిక్షణ
- అబ్బుర పరుస్తున్న చిన్నారుల తూర్పుభాగవతం ప్రదర్శన

బొబ్బిలి రూరల్: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రాచీన జానపదం తూర్పుభాగవతాన్ని మండలంలోని కోమటిపల్లికి చెందిన చిన్నారులు అద్భుతంగా ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రాచీన తూర్పుభాగవతాన్ని భామాకలాపం అంటారు. భాగవతంలో సత్యభామగా, గొల్లభామగా తమ హావభావాలతో పద్యాలను రాగయుక్తంగా పాడి గ్రామీణులను అలరించే కళ తూర్పు భాగవతం. ఈ కళను గ్రామీణులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తారు. మండలంలోని కోమటపల్లిలో తూర్పుభాగవతార్‌గా గుర్తింపు పొందిన బొంతలకోటి సాంబమూర్తి 1962లో ప్రదర్శించిన తూర్పుభాగవతం ఈప్రాంతంలో గుర్తింపు పొందింది. 10వేలకు పైగా దేశంలో పలుప్రాంతాలలో ఆయన ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన మృతిచెందాక ఆయన కుమారుడు బొంతలకోటి శంకరరావు తూర్పుభాగవతాన్ని ప్రదర్శిస్తూ అంతరించిపోతున్న ఈకళ మరుగునపడకూడదనే లక్ష్యంతో గ్రామంలో తనతండ్రి పేరిట బొంతలకోటి సాంబమూర్తి కళాభవన్ ఏర్పాటుచేసి, చిన్నారులకు ఉచితంగా శిక్షణ అందించి,తూర్పుభాగవతం ప్రదర్శింపచేస్తూ వారిని తీర్చిదిద్దారు.

ప్రదర్శన ఇచ్చేది వీరే..

కోమటిపల్లికి చెందిన చిన్నారులు బారు సత్యనారాయణ సత్యభామగా, పెద్దింటి అశ్విని సూత్రధారిగా, కోస్టి రాజేష్ శ్రీకృష్ణుడిగా తూర్పుభాగవతాన్ని ప్రదర్శిస్తున్నారు. మరికొందరు చిన్నారులు మజ్జి యశ్వంత్, శృతి మృదంగం వాయిస్తూ, కోస్టి సంధ్య హార్మోనియం, బొంతలకోటి పేర్నిదేవి, వెలమల ప్రసాద్‌లు తాళం వాయిస్తూ ఇప్పటివరకు సుమారు 22 ప్రదర్శనలు ఇచ్చారు. బొబ్బిలిలోని శ్రీ కళాభారతిలో వారి తొలిప్రదర్శన ప్రముఖులందరినీ అలరించగా, ప్రముఖ వేదపండితుడు కొటికలపూడి హనుమంతు శర్మ ఆశీస్సులతో బొబ్బిలిలోని వేదభవన్‌లో వారి రెండో ప్రదర్శన ఎస్‌ఆర్‌ఐల సమక్షంలో ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగ సమన్వయకర్త వంగపండు ఉష, కళాకారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో, వారి సమక్షంలో ప్రదర్శనలు ఇచ్చి అందరితో శభాష్ అనిపించుకున్నారు. ఏప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగినా వీరు తూర్పు భాగవతం ప్రదర్శిస్తూ ప్రాణం పోస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిన్నారులతో పాటు అభినందిస్తున్నారు. వారికి శిక్షణ అందించిన గురువు, తూర్పు భాగవతార్ బొంతలకోటి శంకరరావును ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.


బొబ్బిలి కళాభారతిలో తూర్పుభాగవతం ప్రదర్శిస్తున్న చిన్నారులు


అద్భుత హావభావంతో పద్యాలు పాడుతున్న గొల్లభామ పాత్రధారి

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం


బాధితులకు సహాయం అందజేస్తున్న వెలమ, శెట్టి బలిజ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు

- రాష్ట్ర వెలమ, శెట్టిబలిజ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు
- ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం అందజేత

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర వెలమ, శెట్టి బలిజ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు నెక్కల నాయుడుబాబు, పిల్లి సుజాతలు తెలిపారు. ఈ మేరకు అగ్నిప్రమాద బాధితులను సోమవారం వారు పరామర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పండగపూట ప్రమాదం జరగడం దురదృష్టకరమని విచారాం వ్యక్తం చేశారు. 13 కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఒకోక్క కుటుంబానికి తక్షణ సహాయం నిమిత్తం 25 కేజీల బియ్యం, కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డు గణపతి, రేగ, కళ్లేపల్లి సర్పంచ్‌లు రావాడ నీలకంఠం ,గోకేడ మునలినాయుడు, శెట్టిబలిజ సంఘం నాయకులు దుంగ వెంకటరమణ, దమ్ము రమణ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీల విజేత ‘ఆమిటి’

- ద్వితీయస్థానంలో అంటిపేట ఎడ్లు


పోటీల్లో పరిగెడుతున్న ఎడ్లు


పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

తెర్లాం: కనుమ పండగ సందర్భంగా మండలంలోని ఆమిటి గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన జిల్లాస్థాయి ఎడ్ల బళ్ల పోటీల్లో ఆమిటి ఎడ్లు విజేతగా నిలిచాయి. గ్రామానికి చెందిన యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు, తెర్లాం జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు ప్రారంభించారు. జిల్లాలోని తెర్లాం, బాడంగి, బొబ్బిలి, సీతానగరం తదితర మండలాల నుంచి 25జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల్లో ఆమిటి గ్రామానికి చెందిన రైతు పెద్దింటి కూర్మినాయుడు ఎడ్లు 19.70 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే సీతానగరం మండలం అంటిపేటకు చెందిన రైతు ఎం.రామకృష్ణ ఎడ్లు 21.19 సెకన్లలో లక్ష్యం చేరుకుని ద్వితీయ స్థానాన్ని, మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన రైతు వెలమల వెంకటనాయుడు ఎడ్లు 21.59 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన పెద్దింటి కూర్మినాయుడు ఎడ్లకు రూ.10వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎం.రామకృష్ణ ఎడ్లకు రూ.6వేలు, తృతీయ స్థానం సాధించిన వెలమల వెంకటనాయుడు ఎడ్లకు రూ.4వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ఎడ్ల పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. ఎడ్ల పోటీల్లో పాల్గొన్న రైతులందరినీ దుశ్శాలువాలతో నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, తెర్లాం ఏఎస్సై మల్లేశ్వరరావు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

విరివిగా బెల్లం తయారీ

- పార్వతీపురం మన్యం జిల్లాలో 40 క్రషర్ల ఏర్పాటు
- టన్ను చెరకుకు 115 కేజీల బెల్లం దిగుబడి


చెరకు గానుగాడుతున్న కూలీలు


ఏపుగా పెరిగిన చెరకు తోట

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో రైతులు వాణిజ్యపంటగా ఎంపిక చేసుకుని సాగుచేస్తున్న వాటిలో చెరకు ఒకటి. రైతులు పండించిన చెరకు కొనుగోలు చేయడానికి ఈ ప్రాంతంలో ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం నిర్మించారు. కర్మాగారం పరిధిలో ఉన్న మండలాల్లో 13 వేలమంది రైతులు 20 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకుపంట సాగుచేయడంతో ఏటా 4 లక్షల టన్నుల చెరకు ఉత్పత్తి జరిగేది. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారం రెండేళ్లుగా మూతపడింది. ఇక్కడి రైతులు పండించిన చెరకును సంకిలిలోని ఈఐడీ ప్యారీస్ చక్కెర కర్మాగారానికి తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో చెరకుపస్తున్న చిన్న, సన్నకారు రైతులు తమవెసులుబాటును చూసుకుని బెల్లం క్రషర్లను ఏర్పాటు చేసుకున్నారు.అలాగే మరికొంతమంది వ్యాపారస్తులు దీనిని అదునుగా చేసుకుని రైతుల నుంచి చెరకు కొనుగోలు చేసి క్రషర్లు నెలకొల్పి బెల్లం వ్యాపారం చేస్తున్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లానుంచి వచ్చిన వ్యాపారస్తులు ఇక్కడ బెల్లం క్రషర్లు నెలకొల్పారు.

గణనీయంగా తగ్గిన చెరకు సాగు

ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ మూతపడడంతో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. 2022-23 సీజన్‌లో ఆయా మండలాల్లో రైతులు లక్షా 50 వేల టన్నుల చెరకు ఉత్పత్తి చేశారు. కర్మాగారం మూతపడిన కారణంగా సంకిలి చక్కెర కర్మాగారానికి చిన్న సన్నకారు రైతులు చెరకు సరఫరా చేయలేక బెల్లం క్రషర్లకు విక్రయిస్తున్నారు. కొంతమంది రైతులు సొంతంగా క్రషర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో ఉన్న బాడంగి, బొబ్బిలి, తెర్లాం, సీతానగరం, రామభద్రపురం, మక్కువ తదితర మండలాల్లో 40 బెల్లం క్రషర్లు పని చేస్తున్నాయి. రోజుకు ఒక్క క్రషరులో బెల్లం తయారు చేయడానికి 6 నుంచి 8 టన్నుల చెరకు అవసరమవుతుంది. బెల్లం క్రషర్ల నిర్వాహకులు రైతులనుంచి టన్ను చెరకును రూ.2,350 నుంచి 2,600 వరకూ కొనుగోలు చేస్తున్నారు.

క్రషర్‌లో తయారుచేసిన బెల్లానికి గిరాకీ..

చెరకు పండించిన నేలలు అనుకూలంగా ఉన్నందున నాణ్యమైన బెల్లం తయారీకి క్రషర్లు సహాయ పడుతున్నాయి. బెల్లం క్రషర్ల నిర్వాహకులు రసాయనాలు వేయకుండా ఇక్కడ బెల్లం తయారు చేస్తారు. ఇక్కడ తయారైన బెల్లాన్ని విజయవాడ, రాజమండ్రి, గుంటూరు ప్రాంతాలకు తరలిస్తారు. అలాగే బెల్లంలో సింహభాగాన్ని ఒడిశా వ్యాపారులు, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, జగదల్‌పూర్ ప్రాంతాలవారు కొనుగోలు చేస్తారు.


మరుగుతున్న చెరకురసం


చిన్నబెల్లం దిమ్మలు

బెల్లం తయారీకి అనుకూల వాతావరణం

క్రషింగ్ ప్రారంభించిన సమయానికి వాతావరణం అనుకూలించడంతో బెల్లం దిగుబడితో పాటు ఆకర్షణీయమైన రంగుతో తయారవుతుంది. పలుప్రాంతాల వారు ఇక్కడి కొనుగోలు చేస్తారు. స్థానికంగా బెల్లం విక్రయాలు జరగడం వల్ల ఎటువంటి ఇబ్బందుల్లేకుండా వ్యాపారాలు సాగుతున్నాయి.

– ఆర్ సింహాచలం, రైతు అనంతరాయుడుపేట

పది మందికి ఉపాధి

కోతదశకు వచ్చిన పంటను గానుగ ఆడించి బెల్లం తయారు చేస్తున్నాం. బెల్లానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మేము పండించిన చెరకుతో బెల్లం తయారు చేయడంతో పదిమందికి ఉపాధి కల్పిస్తున్నామన్న సంతృప్తి ఉంది. పెట్టుబడులు పోను లాభం కనిపిస్తోంది. మాతో పాటు చాలా మంది రైతులు బెల్లం తయారీపై దృష్టిసారించారు.

– లచ్చిపతుల విజయ్‌కుమార్ క్రషర్ నిర్వాహకుడు, భీమవరం